క్లుప్తంగా

జయదుర్గ సేవా సమితి కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని రైతుబజార్ సమీపంలో జయదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను కలెక్టర్ యాస్మిన్ బాషా శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దామోదర్, లక్ష్మీనారాయణ, నలువాల శ్రీకాంత్, రాధాకిషన్, గంగాధర్, సింగారావు, ఫణి భూషణ్, కార్తీక్ సాయి పాల్గొన్నారు.

గోదావరి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయిందని తహసీల్దార్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం వరకు 9 గేట్ల ద్వారా 28 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలినట్లు పేర్కొన్నారు. నది పరివాహక ప్రాంతాలైన కొమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, వేములకుర్తి గ్రామాల ప్రజలు, గొర్రెల, గేదెల కాపరులు, మత్స్యకారులు గోదావరి వైపు వెళ్లొద్దన్నారు. ప్రాజెక్టు మరిన్ని గేట్లు ఎత్తి, నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాపల్లిలో సివిల్ రైట్స్ డే



పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గొల్లపల్లి: సమాజంలోని పౌరులందరూ తమ హక్కులు పొందాలని సర్పంచ్ నల్ల శ్యాం, అధికారులు అన్నారు. గొల్లపల్లి మండలంలోని రాపల్లిలో శనివారం పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన ఉండాలని పేర్కొన్నారు. అనంతరం హనుమాన్ దేవాలంలో పూజలు చేశారు. ఆర్ఐ రాణి, సూపరింటెండెంట్ రవీందర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, ఎంపీటీసీ సభ్యురాలు మంజుల తదితరులున్నారు.

రెడ్ల సమ్మేళనానికి రండి

రాయికల్: మేడిపల్లి మండల కేంద్రంలో ఈ నెల 5న నిర్వహించే జిల్లా రెడ్ల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని రెడ్డి సంఘం రాయికల్ మండల అధ్యక్షుడు చింతలపల్లి గంగారెడ్డి కోరారు. శనివారం ఇటిక్యాల, రాయికల్, కొత్తపేట గ్రామాల్లో రెడ్డి కులస్తులతో సమావేశాలు నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడవాలి

రాయికల్: యువత సన్మార్గంలో నడవాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ సంఘటన మంత్రి యాదిరెడ్డి అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్రలో భాగంగా విద్యార్థులు, యువతీ యువకులతో సమావేశం నిర్వహించారు. దేశభక్తి, సేవా దృక్పథం అలవర్చుకోవాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి గాజం రాజు, సత్సంగ్ ప్రముఖ్ కాయితి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మెట్‌పల్లి: పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో శనివారం స్థానిక రవీంద్ర బాలికల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థినుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన వైద్యుడు గడ్డం రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టుదలతోపాటు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కళాశాల చైర్మన్ సుద్దాల నారాయణ, కరస్పాండెంట్ రాజేశ్వర్ గౌడ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల సమ్మె

రాయికల్: పెండింగ్ బిల్లులు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపడుతున్న సమ్మె శనివారం మూడో రోజుకు చేరింది. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించి, మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్ సబ్సిడీ అందించాలని కోరారు. లక్ష్మి, నీలాబాయి, శంకరమ్మ, పద్మ, మ్యాకల శారద, గంగమణి తదితరులున్నారు.

జీపీ భవనం ప్రారంభం

కథలాపూర్: కలిగోటలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శనివారం ప్రారంభించారు. ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో ఈ భవనం నిర్మించినట్లు అధికారులు తెలిపారు. ఎంపీపీ రేవతి, జెడ్పీటీసీ సభ్యుడు భూమయ్య, సర్పంచ్ సరోజ, ఎంపీటీసీ సభ్యురాలు దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మొద్దు

• కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



పెన్షన్ కార్డులు ఇస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లిరూరల్: బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి శూన్యమని, ఆ పార్టీల నేతల మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్స్‌లో శని వారం పలు గ్రామాలకు చెందిన పెన్షన్‌దారులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వేంపేట, చింతలపేట, చౌలమద్ది, పెద్దాపూర్, కొండ్రికర్ల, కోనరావుపేట, రామారావుపల్లె గ్రామాలకు చెందిన వారికి పెన్షన్ గుర్తింపు కార్డులను అందజేశారు. రానున్న ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్‌ని గెలిపించాలని కోరారు. ఎంపీపీ సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులున్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

కోరుట్ల రూరల్: యెఖీన్‌పూర్‌కు చెందిన శనిగరపు గంగాధర్, మాదాపూర్‌కు చెందిన బుడిమె చిన్న మల్లయ్య ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. బాధిత కుటుంబాలకు ట్రాన్స్‌కో నుంచి మంజూరైన ఆర్థికసాయం రూ.5 లక్షలు, రూ.40 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు శనివారం అందజేశారు. ఏడీఈ ఆంజనేయరావు, ఏఈ శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

'నా కుమారుడిని ఆశీర్వదించండి'

మల్లాపూర్: 3 గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావా లా.. 24 గంటలు ఇచ్చే బీఆర్ఎస్ కావాలో ప్రజలు తేల్చుకోవాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నా రు. శనివారం మల్లాపూర్ మండలంలోని మొగిలిపేటలో ఆసరా లబ్ధిదారులకు పెన్షన్ కార్డులు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో కోరుట్ల నుంచి తన కుమారుడు సంజయ్ పోటీ చేస్తున్నాడని, ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పలు కుల సంఘాలకు అభివృద్ధి నిధుల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. అంతకుముందు రాఘవపేట హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో జగదీశ్, ఎస్సై నవీన్‌కుమార్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు మల్లయ్య, సర్పంచ్‌లు నాగరాజు, దిలీప్ తదితరులున్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించండి

• సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు వివరించాలని సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే, కోరుట్ల బీజేపీ ఇన్‌చార్జి సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. కోరుట్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మరో ఇన్‌చార్జి చాడ శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. నిజామాబాద్‌లో జరిగే ప్రధాని బహిరంగ సభకు ఎక్కువ మంది వచ్చేలా చూడాన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిళ్ల సత్యనారాయణ, అధికార ప్రతినిధి తిరుమల వాసు, కౌన్సిలర్ మాడవేణి నరేశ్, బీజేవైఎం అధ్యక్షుడు కలాల సాయి చంద్, యూసుఫ్‌నగర్ సర్పంచ్ తుక్కారాం గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సభను విజయవంతం చేయాలి

రాయికల్: ఈ నెల 3న నిజామాబాద్‌లో నిర్వహించే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట నారాయణరెడ్డి కోరారు. శనివారం రాయికల్‌లో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ బూత్ నుంచి 100 మంది తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చిలుకమర్రి మదన్‌మోహన్, పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగళారపు లక్ష్మీనారాయణ, దిశ కమిటీ మెంబర్ భూక్య గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల: నిజామాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ఈనెల 3న ప్రధాని మోదీ రానున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఆమె వెంట నాయకులున్నారు.

ఆశవర్కర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పెగడపల్లి: ఆశవర్కర్లను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పెగడపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఆశాలకు శనివారం ఆయన సంఘీభావం ప్రకటించారు. వైద్యశాఖకు సంబంధించిన పలు సేవల్లో ఆశవర్కర్ల పాత్ర కీలకమని, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

కథలాపూర్: మండల కేంద్రంలో ఆశవర్కర్ల రిలే నిరాహార దీక్ష శనివారం కొనసాగింది. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల నాయకులు సంఘీభావం ప్రకటించారు.

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో ఆశవర్కర్లు శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. తమకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులకు ఏఎన్ఎంలుగా పదోన్నతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద ఆశవర్కర్లు శనివారం మానవహారంగా ఏర్పడి, నిరసన తెలిపారు. తమకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, ఏడాదికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

రాయికల్: ఆశవర్కర్ల సమ్మె శనివారం ఆరో రోజుకు చేరింది. తమకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాని, ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

జగిత్యాల: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశవర్కర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ర్యాలీ తీశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, రూ.5 లక్షల ప్రమాద బీమా, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

మల్యాల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆశవర్కర్లు శనివారం మానవహారంగా ఏర్పడి, నిరసన తెలిపారు. తమ హక్కులు సాధించుకునే వరకు దీక్ష కొనసాగిస్తామని పేర్కొన్నారు.

మెట్‌పల్లి: ఆశవర్కర్ల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. మెట్‌పల్లి పట్టణంలో సమ్మె చేస్తున్న ఆశాలకు శనివారం ఆయన సంఘీభావం తెలిపారు. వారికి నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, ప్రమాద బీమా, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు.

మానవత్వం చాటుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి



ఆర్థికసాయం అందిస్తున్న సంజయ్

కోరుట్ల: పట్టణానికి చెందిన సీపీఐ రాష్ట్ర నాయకుడు మౌలానాకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ ఆర్థికసాయం అందించి, మానవత్వం చాటుకున్నారు. మౌలానా శనివారం మెట్‌పల్లిలో ఆయనను కలిసి, తన ఆరోగ్య, ఆర్థిక పరిస్థితి వివరించారు. స్పందించిన సంజయ్ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స చేయించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. అక్కడికి వెళ్లేందుకు ఖర్చుల కోసం రూ.15 వేలు అందించారు.

డీఎస్సీ–1998 అభ్యర్థులు..

డీఎస్సీ–1998 అభ్యర్థులు శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌ని కలిశారు. ఆయన మంత్రి కేటీఆర్‌కు మిత్రుడు కావడంతో తమ సమస్యను సీఎం కేసీఆర్‌కు వివరించాలని కోరారు. స్పందించిన సంజయ్ సీఎం ప్రస్తుతం జ్వరంతో బాధ పడుతున్నారని, తగ్గగానే మంత్రి కేటీఆర్ ద్వారా ఆయనకు వినతిపత్రం అందిస్తానన్నారు. అభ్యర్థుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల సంజీవ్, దాసరి పరంధామ్, కిషన్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత అందరి బాధ్యత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు

రాయికల్: పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో స్కౌట్ విద్యార్థులు స్వచ్ఛతపై స్థానికులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత మనందరి బాధ్యత అని, పట్టణ ప్రజలు సహకరిస్తేనే రోగాలను నిర్మూలించవచ్చని చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, కౌన్సిలర్లు మహేందర్, మహేశ్, కాంతారావు, ప్రిన్సిపాల్ జయశ్రీ, డైరెక్టర్ నిఖిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మెట్‌పల్లి పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్ కరస్పాండెంట్ రామారావు అన్నారు. ఆదివారం నిర్వహించే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై పాఠశాలలో శనివారం మున్సిపల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గంటపాటు శ్రమదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, విష్ణు, ముజీబ్, నిజాం, పున్నం తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. కళాశాల ఆవరణ జలమయం



కళాశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

కథలాపూర్: శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవడంతో కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ జలమయమైంది. శనివారం ఉదయం వర్షపు నీటిలో నుంచి కళాశాలకు వెళ్లేందుకు లెక్చరర్లు, విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. వాన పడితే కళాశాల రోడ్డుపై నీరు చేరుతుందని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపించారు. ఇప్పటికైనా నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేద విద్యార్థి చదువుకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న రచన

కథలాపూర్: తాండ్ర్యాలకు చెందిన నిరుపేద సాదుల రంజిత్ అనే ఇంజినీరింగ్ విద్యార్థి చదువు కోసం అదే గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రుద్ర రచన శనివారం రూ.12 వేల ఆర్థికసాయం అందించింది. రంజిత్‌కు హైదరాబాద్‌లోని ఎ కళాశాలలో సీటు వచ్చింది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ దాతల కోసం ఎదురుచూస్తుండగా.. రచన స్పందించి, సాయం చేసింది. కొన్ని రోజుల తర్వాత ల్యాప్‌టాప్, రూ.70 వేల విలువైన స్టడీ మెటీరియల్ ఇస్తామని హామీ ఇచ్చింది. సర్పంచ్ గంగప్రసాద్, హెచ్ఎం స్వామి, నాయకులు పాలెపు రాజేశ్, అల్లూరి జనార్దన్‌రెడ్డి తదితరులున్నారు.

పిడుగుపాటుకు దూడ మృతి

సారంగాపూర్: పెంబట్ల గ్రామంలో పిడుగు పడి, దూడ మృతిచెందింది. తేలు గంగాధర్ అనే రైతు శుక్రవారం సాయంత్రం తన ఇంటి ఎదుట ఉన్న చెట్టు కింద దూడను కట్టేశాడు. రాత్రి భారీ వర్షం కురిసి, పిడుగు పడటంతో మృతిచెందింది. సంఘటన స్థలాన్ని సర్పంచ్ రాజన్న, రైతులు పరిశీలించారు. బాధితుడికి ప్రభుత్వం పరిహారం అందించాలని కోరారు.

రైలు ఢీకొని గేదె..

కోరుట్ల రూరల్: మెట్‌పల్లి మండలంలోని చింతలపేట శివారులో రైలు ఢీకొని ఓ గేదె మృతిచెందింది. కోరుట్ల మండలంలోని యూసుఫ్‌నగర్‌కు చెందిన కరిపె నరేశ్ అనే పాడి రైతుకు చెందిన గేదె శనివారం రైలు పట్టాల వద్దకు మేతకు వెళ్లగా రైలు ఢీకొట్టింది. తనకు రూ.80 వేల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

రేపు జర్నలిస్టుల ధర్నా

జగిత్యాలరూరల్: దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఈ నెల 2న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయూ) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి మోరపల్లి ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లో జర్నలిస్టులు ధర్నా చేపట్టాలని పిలుపునిచ్చారు.

లేబర్ కార్డుదారులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

రాయికల్: పట్టణంలోని ఉన్నత పాఠశాలలో తెలంగాణ భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో శనివారం లేబర్ కార్డుదారులకు 50 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, క్యాంపు ఇన్‌చార్జి రఫీ, సామాజిక కార్యకర్త మల్యాల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

మల్లాపూర్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు ఆరోపించారు. శనివారం వాల్గొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికైనా నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇవ్వాలని, ప్రతీ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేశ్, గంగాధర్, రాజు, నరేశ్, జైపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

రాని అధికారులు.. ఖాళీగా కుర్చీలు



ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయానికి శనివారం అధికారులెవరూ రాకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఎంపీడీవో ప్రభును వివరణ కోరగా.. తాను, ఎంపీవో కృపాకర్ సమావేశాలకు వెళ్లామని, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ సాయి, టైపిస్ట్ నాగరాణి సెలవులో వెళ్లినట్లు తెలిపారు. అధికారులు లేకపోవడంతో దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు వెనుదిరిగారు.

'బీజేపీ ఎదుగుదలను ఓర్వలేకనే దాడులు'



పరామర్శిస్తున్న సత్యనారాయణరావు

ధర్మపురి: గణేశ్ నిమజ్జనం సందర్భంగా బీజేపీ నాయకులపై చేసిన దాడిని ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు అన్నారు. ధర్మపురి మండలంలోని బుద్దేశపల్లెలో బాధితులను శనివారం పరామర్శించారు. గత గురువారం అర్ధరాత్రి కొందరు యువకులు బీజేపీ నాయకులపై దాడి చేయగా స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. బాధ్యత గల పదవిలో ఉన్న గ్రామానికి చెందిన వ్యక్తి ఇలాంటి దాడులను పురిగొల్పడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించబోమని హెచ్చరించారు. గ్రామాల్లో బీజేపీ ఎదుగుదలను ఓర్వలేకనే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు ఆకుబత్తిని తిరుపతి, నాయకులు కొక్కు గంగాధర్, గాజుల విజయ్‌కుమార్ తదితరులున్నారు.

కూలిన డ్రైనేజీ గోడలు



బుగ్గారం: మండల కేంద్రంగా ఏర్పడిన బుగ్గారంను మంత్రి కొప్పుల ఈశ్వర్ దత్తత తీసుకొని, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీల పనులు పూర్తయ్యి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీ గోడలు కూలిపోవడంతో నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శ్రమదానం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం శ్రమదానం చేపట్టారు. పిచ్చిమొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుపతిరెడ్డి, అధ్యాపకులు రాజయ్య, జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండగట్టు: కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రిన్సిపాల్ సంజీవ్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అందరం ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ప్రతీ విద్యార్థి స్వచ్ఛతా హీ సేవ స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను రెగ్యులర్ చేయాలి



సారంగాపూర్: మద్దతు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

సారంగాపూర్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ సభ్యురాలు పాత పద్మ కోరారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు శనివారం మద్దతు తెలిపారు. టీచర్లు, ఆయాలను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కొల్వాయి సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు రంగు లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు బదినెపల్లి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెర్మారి సుభాశ్, ఉపాధ్యక్షుడు ఎనుగు జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: సీఎం కేసీఆర్ మనసు మార్చాలని కోరుతూ అంగన్‌వాడీలు శనివారం రాయికల్ పట్టణంలోని శివాలయంలో పొర్లుదండాలు పెట్టారు. ఆయన తమ సమస్యలు పరిష్కరించేలా చూడాలని స్వామివారిని కోరారు.

వినాయకా.. వీడ్కోలిక



జగిత్యాలరూరల్: లక్ష్మీపూర్ గ్రామంలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి శనివారం శోభయాత్ర నిర్వహించి, గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ధర్మపురి: మండలంలోని కమలాపూర్ గ్రామంలో దరగ్యాస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి శనివారం నిమజ్జనం నిర్వహించారు. రాయపట్నం గోదావరి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి, కార్యక్రమం పూర్తి చేశారు. యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆందోళన చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

జగిత్యాల: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ–పంచాయతీ కంప్యూటర్ల ఆపరేటర్లు డిమాండ్ చేశారు. శనివారం జగిత్యాలలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, వినతిపత్రం అందజేశారు. జిల్లాస్థాయిలో పని చేస్తున్న తమకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సాంబశివ, రమేశ్, సంతోష్‌కుమార్, వెంకటరమణ, నాగమణి, శ్రీధర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.